# సంతాప సందేశం

-ఎస్.ఆర్.నంది

**ఆంధ్రలో జరిగిన వో చిన్న సంఘటనవల్ల అమెరికావాడు అరడజను విమానాల్లో ఆరొందల ఆటంబాంబుల్ని తీసికెళ్లి ప్రపంచదేశాలన్నిటి మీదా ధడాధడా పడేసిపోయాడంటే నమ్మగలవా?**

ఎందుకు నమ్మలేం? ఎద్దు ఈనిందంటే దూడను దొడ్లో కట్టెయ్యమన్చెప్పి ఆదరాబాదరా మన పన్లలో కొట్టుకుపోయే స్పీడ్‌యుగంలో వున్నాం. ఏ యాక్షన్‌కి ఏ రియాక్షనొస్తుందో చెప్పలేని అయోమయ పరిస్తితి.

ఇదెలా జరిగిందంటే... కడపలో మైపాడు చిన బాబుగారు చనిపోయార్ట. చనిపోయిన వెంటనే మిగతా శవ కార్యక్రమాలన్నిట్నీ పక్కకు పెట్టి హైద్రాబాద్‌లో వున్నటువంటి కళాప్రపూర్ణుడు గారికి ఫోన్‌చేసి తెలీపర్చారు. అయ్యో మైపాడు చినబాబుగారు పోయారంటూ. ఆయనగారెవరో ఈయనగారికి తెలియాలని లేదు. చావు ఫోన్రాగానే సంతాపసందేశం ప్రిపేరయిపోతుంది. ఈ సంతాప సందేశం పత్రికల్లో పడ్తేనేగాని శవాన్ని కదపడానికి వీల్లేదు–ఎంతపెద్ద డాక్టర్ శవ సర్టిఫికేట్ ఇచ్చినా సరే. అది సెంటిమెంట్.

కళాప్రపూర్ణుడి దగ్గర ఓ పెద్ద బుక్కుంది. అందులో ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతాల్లో వున్న చిన్నాపెద్దా వ్యక్తుల చరిత్ర క్లుప్తంగా వుంటుంది. ఆ పుస్తకం పేరు 'చావుబతుకుల మధ్యజీవి'.

ఫోన్రాగానే కళాప్రపూర్ణుడు పుస్తకం తెరిచాడు. చచ్చినాడిపేరు మైపాడు చినబాబు. ఆ పేరు పుస్తకంలో లేదు. ఓ.కే... మోపెడు చిన్నారావు పేరుందిగా? వాణ్ణి చంపేసినా అడిగేవాడెవడు? సంతాప సందేశంకోసం మోపెడు చిన్నారావు జీవిత చరిత్ర నాలుగులైన్లూ చదివాడు.

'మోపెడు చిన్నారావు: వయస్సు: 48. ఎత్తు 6. ఛెస్ట్ నలభై రెండు. వృత్తి రాజకీయాలు. వ్యావృత్తి రౌడీయిజం. సరదాలు: మర్డర్లు. ఆస్తిపాస్తులు: పదివేల సోడాబుడ్లు. తొమ్మిదొందల నాటుబాంబులు. ముగ్గురు భార్యలు. ఆర్గురు సైదు భార్యలు. పదిమంది సంతానం.' కవిత్వం అప్పడప్పుడు గొలకడం హాబీ.





# సి.నా.రె ఛలోక్తులు



ఒకప్పటి రెవిన్యూ మంత్రి, రైతు నాయకుడు పి.తిమ్మారెడ్డిగారి గురించి నారాయణరెడ్డిగారు ఓ సభలో మాట్లాడుతూ "తిమ్మారెడ్డి తతిమ్మా రెడ్లవలె కాదు" అనగానే సభ గొల్లుమంది. –డా. జె.బాపురెడ్డి హైదరాబాద్.

సేకరణ: డాక్టర్ ఎన్. గోపి

జీవితచరిత్ర చదివాక సంతాపసందేశం ఫోన్లో పత్రికలకు వెళ్ళిపోయింది!

"సహృదయుడూ, కవితామూర్తి అయిన మోపెదు చిన్నారావుగారి మరణవార్తకి కళా ప్రపూర్ణ కనకరాజుగారు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. వారికి ఒక భార్య ఇద్దరు సంతానం. జిల్లాలో అతి నిరాడంబర జీవితం గడిపే గాంధేయవాది... వారి ఆత్మకు...

ఓ.కే ఒకే మిగతా మేటరంతా మాదగ్గరుంది సార్. ఒక చచ్చినవాడి పేరూ వూరే మారుస్తారు పత్రికలవాళ్లు. మిగతాదంతా రోజూ ప్రింట్‌చేసే మేటరే.

ఉదయం పత్రికల్లో చిన్నారావు చావువార్త పల్లేదు. సతాపసందేశం పడిపోవడంతో చిన్నారావు చూసి వుగ్రుడైపోయాడు. ఆయనగారి కళ్లు నాటుబాంబులయ్యాయి. శరీరం సోడా బుడ్డయింది. వొళ్లు కడప ఎండల్లా మండిపోయింది.

ఆ పిచ్చయ్య నాకొడుకే ఈ చావువార్త పంపించి వుంటాడు.

"ఒరే ఆ నలుగురెదల్నీ పట్రండ్రా" అరిచారు చిన్నారావుగారు.

నలుగురౌడీ 'ఎదవలూ' క్షణాల్లో మోపెదు చిన్నారావుగారి ముందు మోకరిల్లిపోయారు. ఒక్కొక్కడూ ఏదుపందికీ, ఖడ్గమృగానికీ పుట్టిన క్రాస్‌బ్రీడ్ 'ఏదుఖడ్గ'ల్లా వున్నారు.

"ఆజ్ఞ"

"ఒరే! ఆ పిచ్చయ్య ఎదవ ఐదరాబాద్‌లో ఏ ముండింట్లోనో తొంగునుంటాడు. ఆణ్ణి లేపేసిరండి"

'ఏదు ఖడ్గలు' హైద్రాబాద్‌కి పోయాయి కార్లో. ఎందుకు లేపెయ్యాలి, ఎలా లేపెయ్యాలి అనే ప్రశ్న ఎప్పుడూ వాళ్ళ నోట్నుంచి రాదు. అయ్యగారి నోటి ఆజ్ఞ. అంతే ఆమల్చేసెయ్యాలి.

రౌడీ రాజకీయనాయకుల్ది ఏవూరైనా వాళ్ళకి రాజధానినగరంలో ప్రత్యేకమైన గూఢచారి నెట్‌వర్క్ వుంటుంది. నాలుగు'ఏదుమృగాలు' కడప నుంచి బయల్దేరేసరికే చిన్నారావు గూఢచార్లు, పిచ్చయ్య ఏ ముండింట్లో వున్నాడో కూపీలాగేశారు.

'ఏదు మృగాలు' హైద్రాబాద్‌లో దిగగానే బస్‌స్టాండ్‌లోనే వాళ్ళకి ఎదురై 'ఒరే! ఆ పిచ్చయ్యగాడు దమయంతి యింట్లో తొంగుంటాడు. కాని రేత్రికి బెజివాడ బస్‌లో ఎల్తున్నారు' అంటూ వాళ్లెక్కే బస్ నంబరూ సీట్ల నెంబర్లూ వీళ్లకిచ్చారు.

అదే బస్‌లో 'ఏదు మృగాలు' కూడా సాయంకాలం ఎక్కాయి. ఏడూ, ఎనిమిదీ సీట్లలో ఇద్దరు కూచున్నారు. వాళ్లే పిచ్చయ్య,పిచ్చయ్య స్నేహితులని తేల్చుకోనవసరంలేదు. గూఢచారి శాఖ చెప్పింది అంతే. ఆ సాయంకాలం అన్నో నంబర్ బస్‌లో అన్నో నెంబర్ సీట్లో ఎవరు కూచున్నా వాడే పిచ్చయ్య. వాణ్ణి చంపెయ్యాలి.

బస్ కదిలి కొంతదూరం వెళ్ళాక 'ఏదు మృగాలు' బస్‌ని దారిమళ్లించాయి. అలవాటైన దారిమళ్లింపే గాబట్టి డ్రైవర్ బీడీ వెలిగించుకుని బస్‌ని పక్కరోడ్డుకి తీసికెళ్లాడు.

'ఆడేరా పిచ్చయ్యగాడు" అనరిచాడు ఓ 'ఏదు మృగం'–ఏడో నెంబర్ సీటువేపు చూపిస్తూ.

పెట్రోలు వాళ్ళ నెత్తిన వొంపేశారు. హడిలిపోయిన ఎడెనిమిది నంబర్లు నెత్తీనోరూ బాదుకున్నారు. "కాదుబాబో, ఆ పిచ్చయ్యగాడు ఎవడో మాకు తెల్దుబాబో" అని అరిచారు.

ఏదుమృగాలు కాస్త బుర్ర వుపయోగించాయి. ఈ ఎదవలు కాదంటే నమ్మటం ఎలా? గూఢచారిశాఖ అబద్ధం చెప్పదు. అందువల్ల మొత్తం బస్‌నే తగలెట్టేస్తే?

థాట్ రావడం తరవాయి పెట్రోల్ని బస్ మొత్తం మీ్మద చల్లేసి అగ్గిపుల్ల వెలిగించి విసిరేశారు. గుప్‌మంది మొత్తం బస్సు: అగ్నిపర్వతం అయింది. సజీవదహనం. ఏదు ఖడ్గాలు యాంత్రికంగా వెళ్ళిపోయాయి తిరిగి స్వగ్రామానికి.

ఈ విషయం తెల్సుకున్న పిచ్చయ్య దమయంతి కొంపలో మీసాలు తిప్పకుంటూ పకపకా నవ్వాడు.

"చూడే! ఆ సిన్నారావుగాడు ఈ పిచ్చెయ్యను సంపడానికి ప్లానేస్తే ఆ ఏడూ, ఎనిమిది సీట్లలో ఆడి బామ్మర్దుల్నే కూసోబెట్టి సంపించాను. హహహ' అని నీటిగుర్రంలా నోరు తెరిచి సకిలించాడు పిచ్చయ్య.

ఇక్కణ్ణుంచి మొదలయింది–ఎద్దు ఈన్తే దొడ్లో కట్టెయ్యమన్నకథ.

బస్ ప్రయాణీకుల్ని తీవ్రవాదులు సజీవంగా దహనం చేసేశారనే వార్తని పత్రికలు పతాక శీర్షికల్తో ప్రచురించాయి. ఆ కాల్చుడు విధానం చూస్తుంటే 'గోపన్న' దళమే ఆ బస్సుని తగలేసి వుంటుందని ఓ ఛోటా నాయకుడు ప్రకటించాడు. దాంతో జైల్లో వున్న గోపన్న ఎన్‌కౌంటర్లో ఆ రాత్రే చచ్చిపోయాడు!

ఈవార్త అన్నలకు తెలిసి అడవిలో మాటేశారు. ఆ మర్నాడు పోలీసుపార్టీ జీప్‌లో వస్తొంటే డైనమైట్‌పెట్టి జీప్‌ని పేల్చేశారు. జీప్‌లో అస్సలు పోలీసులు లేరనిన్నీ, బస్‌లో వెళ్తే తీవ్రవాదులు తగలెట్టేస్తారనే భయంతో ఓ పెళ్ళిపార్టీవాళ్లు దొంగతనంగా ఎర్రజీప్ డ్రైవర్‌కి లంచమిచ్చి ఆ జీప్‌లో పక్కపల్లెకు పోతూవుంటే, ఎర్రరంగు పోలీసు చిహ్నంకాబట్టి పొరపాటున జీప్‌ని పేల్చేశారుట అడవి అన్నలు.

ఈవార్తనీ పత్రికలు పతాక శీర్షికల్తో ప్రచురించేశాయి. మండాపురంకి ముప్పయి మైళ్ల దూరంలో పేలిపోయిన జీప్‌లో పెళ్లికొడుకు కూడా వున్నాడని, ఆ దురదృష్టవంతుడితోబాటు

అంతా మృత్యువుపాలయ్యారని దేశంలో ప్రతి కలన్నీ గగ్గోలుపెట్టాయి.

ఈ వార్త యిక్కడ ఎలాంటి రియాక్షన్నీ కలిగించలేదు. కాని కాశ్మీర్‌లోయలో కాశ్మీరీ ఉగ్రవాదులు - ఆవేశంతో వూగిపోయారు.

"భాయీయో! యే ఖచడా హిందూస్థాన్‌మే హమారా ముసల్మాన్ భాయీయోంకో డైనమైట్‌తో పేల్చేసి మార్‌దియా హై. హైద్రాబాద్ షహర్‌మే కేవలం ముసల్మానీ రహతేహై. ఉసీలియే జో ఆద్మీ మర్‌గయా, ఓ సబ్ ముసల్మాన్‌హీ హై." అంటూ కాశ్మీరీలో పాకిస్థానీ మేడ్ ఏకే ఫార్టీసెవన్ రైఫిల్స్ పట్టుకుని వీరంగం చేశారు.

ఆ రాత్రికి రాత్రే ఇండియా నుంచి శ్రీనగర్‌కి వచ్చిన నలుగురు యాత్రీకుల్ని కిడ్నాప్ చేసి తీసుకుపోయారు.

అందులో యిద్దరు అమెరికన్లు. ఒకడు రష్యన్. మరొకడు యూదు.

ఆ రోజునే కాశ్మీర్ అధికారులకు వార్త పంపించారు.

"మేం, జాదీ కాశ్మీర్ వీరులమైన మేం ఇండియా గవర్నమెంటుకు పంపుకున్న అల్టిమేటం: ఓరే ఇండియా! మేం నలుగురు విదేశీ యాత్రికుల్ని కిడ్నాప్‌చేశాం. హిందువుల్నీ కిడ్నాప్ చేద్దామంటే కాశ్మీర్‌లో ఒక్క హిందువన్నా లేకుండాపోయాడు. మీరు మా ఆజాద్ కశ్మీర్ వీరుల్ని మీ హిందూ జైళ్ల నుంచి తక్షణం విడుదల చెయ్యకపోయారా, ఈ రష్యన్ కాలు ఒకరోజున, అమెరికన్ చేతులు ఒకరోజున, యూదుగాడి కళ్లు ఒకరోజున నరికేసి పీకేసి పారేస్తాం."

భారత్ ప్రభుత్వం నవ్వుకుంది. "కాశ్మీర్ ఉగ్రవాదులకి బుర్రలేదనడానికి యిదో నిదర్శనం. వీళ్ళకి పొరిగింటి పుల్లదేశం సహాయం చేస్తున్నట్టు మాకు సాక్ష్యాధారాలు దొరకడం ఇది పదిహేనువందలోసారి. సమయం వచ్చినపుడు బయటపెడ్తాం వల్లగా. అందాకా ఆ కాళ్లనీ, కళ్లనీ, చేతుల్నీ రక్షించుకోవాల్సిన బాధ్యత ఆయా పరదేశాలవాళ్ళవే" అని మెల్లగా ఉత్తరాలు రాసి యు.ఎన్.ఓ వారికి ఒడలో పంపించింది.

భారత్ పక్కనే వున్న పొరుగింటి పుల్లదేశంకి అమెరికావాళ్లు ఫోన్ చేశారు.

రష్యావాళ్లు సెటిలైట్ ద్వారా వార్త అందించారు పుల్లదేశానికి.

యూదులు మాత్రం ఆ పుల్లదేశానికి ఎలాంటి ఫోనూ చెయ్యలేదు.

ఇజ్రాయిల్‌కి పుల్లదేశానికి రాయబారాలు లేవు. మాటల్లేవు. ఎడమొహం పెడమొహం. అందువల్ల ఇజ్రాయిల్ అమెరికా నెత్తెక్కి గారాబం చేసింది.

"చూడు అమెరికా! అమెరికా! ఆ పుల్లదేశం మా కుర్రాణ్ణెవణ్ణో బంధించేసింది. కుర్రాడి కళ్లు పీకేస్తానంటోంది. కళ్లు కాదుకదా వాడి తల వెంట్రుకు వూడినా ఈ భూమ్మీద ఆ పుల్లదేశం ఒకానొకప్పుడు వుండేదేమో అని పురాతత్వ పరిశోధకుల పరిశోధన చేసేటట్టు చేస్తాం. ఆ దేశంతోబాటు ఆ దేశ జనాభా కూడా తుడిచిపెట్టుకుపోతుంది. అందువల్ల ఆ దేశంలో వున్నటువంటి ఇతర దేశాల రాయబారులూ, జనమూ రెండు గంటల్లోగా ఖాళీచేసి వెళ్లిపోవాలి" అని ఇజ్రాయిల్ నుంచి పవర్‌ఫుల్ రేడియో తరంగాలని ప్రపంచానికి ప్రసారం చేసింది.

ఇజ్రాయిల్ రెండు గంటలే టైమ్ యిచ్చింది. కాని ఓ ఘంటలోనే పుల్లకూర దేశంనుంచి ప్రపంచ దేశాల రాయబారులూ, ఇతర వ్యాపకాల్లో వున్నవాళ్లు కొన్నివేల విమానాల్లో పోలోమంటూ వాళ్ళ వాళ్ళ దేశాలకు పోయారు.

కాని భారత్ రాయబారులూ, రాయబార స్టాఫూ అక్కణ్ణుంచి కదల్లేదు. భారత ప్రభుత్వం కూడా విమానాలని వాళ్ళకోసం పంపలేదు.

"సార్, మనమంతా మూకుమ్మడిగా ఇజ్రాయిల్ విమానదాడుల్లో చచ్చిపోతాం సార్. ప్రభుత్వానికి మొరపెట్టండిసార్. మీరు చర్యతీసుకోకపోతే మేమంతా కాలినడకను భారత్‌కి పారిపోతాం" అని భారతీయులంతా కళ్లనీళ్లు పెట్టుకున్నారు.

కాని భారత రాయబారి ఉ అన్లేదు. ఆ అన్లేదు. అలా చూస్తూ మౌనంగా వుండిపోయారు.

రెండు గంటల టైమ్ గడువు పూర్తిగాకముందే మొత్తం పుల్లకూరదేశం పౌరులంతా బోర్డర్‌దాటి భారత్ భూభాగంలోకి ప్రవేశించేస్తున్నారు. ఒక మానవ కెరటంలా, ఉవ్వెత్తున కొట్టుకొస్తున్న పుల్లన్నలను చూసి మిలటరీ సంకోచించిం దిగాని భారత ప్రభువులు అతి ధైర్యంగా పార్లమెంటులో అసమ్మతివర్గంతో పోట్లాటకు తయారయ్యారు–పెద్ద సీటుకి ఎసరుపెట్టాలని.

రెండుగంటల గడువుదాటగానే ఇజ్రాయిల్, రెండువందల ఏటంబాంబుల్ని రెండువేల విమానాల్లో వేసుకుని పుల్లదేశం వేపుకి ఉరుకులు పరుగుల మీద వొచ్చేస్తోంది.


కాని సద్దాం హుస్సేన్ జడవలేదు. నమాజు చేసుకుంటున్నాడు అండర్‌గ్రౌండ్‌లో.

మేజరూ మైనరూ ఎన్నికల కోలాహలంలో వున్నారు... ఇండియా ఇంగ్లండ్ క్రికెట్ మాచ్ మంచి రసవత్తరంగా సాగుతోంది. యుగోస్లావియాలో జనం తన్నేసుకుంటూనే వున్నారు... సినిమాల్లో సెక్స్ దృశ్యాల్ని పదోసారి సెన్సార్ వాళ్లు వేసుకుని ఆనందిస్తున్నారు... రష్యా పెరిస్త్రోయికా అయిపోతూనేవుంది. సోమాలియా సొమ్మసిలిపోయింది.

అయితే ఇంకా రెండు గంటల గడువు ఇలా పూర్తి అవగానే, పుల్లదేశం నుంచి ఒక విమానం వచ్చి ఢిల్లీలో దిగింది.

దాన్లో నుంచి కశ్మీరీ మిలిటెంట్లు అపహరించిన యూదు యాత్రికుడు వివిపీలా దిగాడు. దిగిన వెంటనే పుల్లదేశం విమానం వెనక్కు పారిపోయింది. ఇండియాలో అసమ్మతి గెలవలేదు. అందువల్ల వాళ్లు విడిపోయి మరో కొత్తపార్టీ పెట్టుకున్నారు... యూదుయాత్రీకుడి తల వెంట్రుకలన్నీ లెఖ్ఖకు సరిపోయాయి... మరో రెండు కొత్తవి మొలిచాయట... ♦

## ధీరోదాత్తత!



"మీ హృదయ సింహాసనాధిపతినైన రామ మహారాజును నేను. నేను వేదాల ద్వారా ఆదేశించినపుడు, కురుక్షేత్రంలో ఉపదేశించినపుడు, జెరూసలేములో, మక్కాలో ప్రబోధించినప్పుడు, నన్ను, నా ప్రబోధాలను మీరు సరిగా అర్థం చేసికోలేదు. మళ్లీ నా గళమెత్తాను. నా వాణి మీ అందరియొక్క అంతర్వాణియే. తత్త్వమసి! తత్త్వమసి!"

ఇంతటి ధీరోదాత్తుడు ఎవరు? ఇంకెవరు? ఆయనకు ఆయనే సాటి! శ్రీస్వామి రామతీర్థ — కందికొండ సూర్యనారాయణశాస్త్రి